క్లుప్తంగా

క్రీడాభివృద్ధికి నిరంతర కృషి

మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పాండు తదితరులు

కందుకూరు: క్రీడల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిట్టల పాండు అన్నారు. మండల పరిధిలోని ధన్నారంలో ఆయన శుక్రవారం రాత్రి వాలీబాల్ పోటీలు, శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ పోటీలకు రూ.50 వేలు, క్రికెట్ పోటీలకు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, కరుణాకర్, రమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఉపసర్పంచ్ లతీఫ్‌ఖాన్‌ను పరామర్శిస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం ఉప సర్పంచ్ ఎండి.లతీఫ్ ఖాన్ మాతృమూర్తి అమీనాబీ మృతి చెందారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు వారి నివాసానికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు. లతీఫ్ ఖాన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి మనో ధైర్యాన్ని కలిగించారు. ఈ కార్యక్రమంలో నాగారం సర్పంచ్ బండారి లావణ్య లింగం, మార్కెట్ డైరెక్టర్ కర్రె రాజు, పలువురు మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రవిప్రసాద్ (ఫైల్)

మీర్‌పేట: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ బి.సత్యనారాయణ కథనం ప్రకారం.. గుర్రంగూడ ఆదిత్యనగర్‌కు చెందిన రవిప్రసాద్ (56) మానసిక స్థితి సరిగా లేదు. ఈనెల 7వ తేదీన రవిప్రసాద్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 13, వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 45, ఆలు 23, ఉల్లి 24, గోకర 35, దోస 28, సొర 13, పొట్ల 13, అరటి 9, చిక్కుడు 60, అర్వి 60, మునగ 85, చిలగడదుంప 28, బీట్‌రూట్ 17, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ 50 ప్రకారం ధరలు పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సమస్యలు పరిష్కరించాలని సీఎస్‌కు వినతి



సీఎస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాసులు

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరల పెంపుతో పాటు నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇప్పటికీ 2016లో నిర్ణయించిన ధరలే కొనసాగుతున్నాయన్నారు. దీంతో నిర్వాహకులకు డబ్బులు సరిపోక పోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ నివేదికను పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలని కోరారు.

రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతాం

- ఇరుకుగా ఉన్న రహదారులను విస్తరించి అభివృద్ధి చేస్తాం
- మంత్రి సబితారెడ్డి
- రూ. 2 కోట్ల 38 లక్షల నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభం



ఎల్ఈడీ సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: మండలంలోని రోడ్లను విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి సర్వంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో 2 కోట్ల 38 లక్షల రూపాయలతో మహేశ్వరం గేటు (శ్రీశైలం జాతీయ రహదారి)– మహేశ్వరం మండలం కేంద్రం వరకు ఎల్ఈడీ సెంట్రల్ లైటింగ్‌ను ఆమె జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీలో సుమారు రూ. 5 కోట్ల పైచిలుకు నిధులతో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇరుకుగా ఉన్న రోడ్లను రాకపోకలకు ఇబ్బంది కలగకుండా విస్తరించి నిర్మాణం చేస్తామన్నారు. మహేశ్వరంలో 306 ఎలక్ట్రానిక్ పార్కుల్లో భారీ పరిశ్రమలు విప్రో, మలబార్, బ్యాటరీ తయారీల కంపెనీలతో పాటు మరిన్ని కంపెనీలు వచ్చాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద కంపెనీలు మహేశ్వరానికి రాబోతున్నాయని వాటిని దృష్టిలో పెట్టుకొని రోడ్లను విస్తరించి నిర్మాణం చేస్తున్నామని ఆమె తెలిపారు. మహేశ్వరం మండల కేంద్రం నుంచి పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వయా మన్సాన్‌పల్లి చౌరస్తా రోడ్డును రూ.108 కోట్లతో సుమారు 100 ఫీట్లు (నాలుగు లేన్ల) నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కోళ్లపడకల్–నాగారం రోడ్డును రూ.15 కోట్లతో 40 ఫీట్ల వెడల్పుతో నిర్మాణం జరుగుతుందన్నారు. మహేశ్వరం గేటు నుంచి మహేశ్వరం మండలం కేంద్రం వరకు రూ.5 కోట్లతో నాలుగు లేన్ల బీటీ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతానాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు అయ్యద్ అదిల్ అలీ, మహేశ్వరం సర్పంచ్ ప్రియాంక, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, రవినాయక్, ఆలయ డైరెక్టర్ కె. చంద్రయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య, బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, నవీన్, సురేఖారెడ్డి, వీరానాయక్, అంధ్యా నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, శ్రీనివాస్, అజయ్, మైసయ్య, చందు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథ స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి తిరు కల్యాణమును వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరు కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్, పూజారులు అజయ్, మురళీ, భక్తులు పాల్గొన్నారు.

సీతామెడోస్ కాలనీలో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి సీతామెడోస్ కాలనీలోని గోల్డెన్ టెంపుల్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి రాఘవేంద్రరావు దంపతులు ఆలయ అలంకరణ, గోదాదేవి రంగనాథ స్వామివారికి పట్టువస్త్రాలు,పుస్తెమెట్టెలుసమర్పించారు. వేద పండితులు మంజునాథశర్మ సమక్షంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ దేవాలయంలో..

బడంగ్‌పేట్: ప్రాచీన చారిత్రం కలిగిన ప్రసిద్ధ బడంగ్‌పేట్ స్వయంభు కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం గోదాదేవి అమ్మవారికి, రంగనాథస్వామికి ఘనంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి భక్తులు భారీగా హాజరై కల్యాణ ఘట్టాలను తిలకించారు. భక్తులు గోదారంగనాథస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ ధర్మకర్త చక్రవర్తుల జగన్మోహనా చార్యులు, భక్తులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: గోదారంగనాథ స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



హుడాకాంప్లెక్స్: గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



చిప్పలపల్లిలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఎంపీటీసీ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి, ధన్నారం, మురళీనగర్ గ్రామాల్లోని దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లను ఎంపీటీసీ లలిత కుమార్ ఆధ్వర్యంలో శనివారం అందజేశా రు. మంత్రి సబితారెడ్డి చొరవతో బస్‌పాస్‌ల ను అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బాలకృష్ణ, శ్రీదేవిశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం

మంత్రి సబితారెడ్డి

- ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: ఓడిన వారు నిరుత్సాహ పడకుండా పట్టుదలతో గెలుపు కోసం పోరాడితే తప్పకుండా విజయం వరిస్తుందని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, సరిత డెయిరీ ఆర్థిక సహకారంతో స్వామి వివేకానంద ఆధ్వర్యంలో చాలెంజ్ కప్–2023 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను వీక్షించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడల్లో, జీవితంలో గెలుపోటములు సర్వసాధారణమని అన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. ఈ పోటీల్లో మొత్తం 60 జట్లు పాల్గొనగా.. ఫైనల్ పోరులో జ్యోతి క్లబ్ వర్సెస్ ఆర్ఆర్ బాయ్స్ హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోరులో విన్నర్‌గా జ్యోతి క్లబ్, రన్నర్‌గా ఆర్ఆర్‌సీ బాయ్స్ జట్టు గెలుపొందాయి. మూడవ, నాలుగవ స్థాయిలో మన్సాన్‌పల్లి, రావిర్యాల జట్లు గెలుపొందాయి. టక్కఫర్ పోటీలో విన్నర్‌గా పెండ్యాల, రన్నర్‌గా రామచంద్రగూడ జట్లు గెలుపొందాయి. ఫైనల్ విజేతకు రూ.30,000, ద్వితీయ బహుమతులు రూ.15 వేల నగదు, జ్ఞాపిక, తృతీయ, చతుర్థి జట్లకు నగదు బహుమతులను మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పెండ్యాల సర్పంచ్ మంత్రి సంధ్య, ఉప సర్పంచ్ ఎండి.గౌస్, కల్వకోల్ ఎంపీటీసీ తొంట స్వప్న, రామచంద్రగూడ, కల్వకోల్, మన్సాన్‌పల్లి, డబిల్‌గూడ, ఎస్టీ తండా, నాగారం గ్రామాల సర్పంచ్‌లు శివి రాజు నాయక్, థామస్ రెడ్డి, కంది అరుణరమేశ్, బుగ్గని శంకర్, రాజు నాయక్, బండారి లావణ్యలింగం ముదిరాజ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, శివగంగ ఆలయ చైర్మన్ సుధీర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి, నవభారత్ యూత్ నాయకులు హన్మంత్‌రెడ్డి, యాదయ్య గౌడ్, మాణయ్య, ప్రహ్లాద్‌రెడ్డి, బాల్‌రాజ్, రాజేశ్, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయ్, అనిల్ పలువురు పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో భోగి మంటలు వేస్తున్న యువకులు తదితరులు



బడంగ్‌పేట్: బాలాజీనగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మేయర్ పారిజాత

ఘనంగా భోగి వేడుకలు

మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసుకొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులకు రేగు పండ్లను పోశారు. ప్రతీ గడప ముందు మహిళలు రంగవల్లులు వేసి అలరించారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేసి పండుగనుసంతోషంగా జరుపుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పహాడీషరీఫ్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న 12వ డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్



కందుకూరు: గూడూరులో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు

సీసీ రోడ్లకు రూ.4.80 కోట్లు మంజూరు

జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పరిధిలో కందుకూరు మండలంలో వివిధ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు గాను రూ.4.80 కోట్ల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగర్‌మియాగూడ బాచుపల్లి, చిప్పలపల్లి, ధన్నారం, గూడూరు, జబ్బార్‌గూడ, జైత్వారం, కొలన్‌గూడ, లేమూరు, మురళీనగర్, రాచులూరు గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయని చెప్పారు. కందుకూరు, నేదునూరుకు, గుమ్మడవెల్లి, రూ.30 లక్షల చొప్పున, తిమ్మాపూర్‌కు రూ.25 లక్షలు, బేగంపేట, దాసర్లపల్లి, దెబ్బడగూడ, కటికపల్లి, సరస్వతిగూడలకు రూ.15 లక్షల చొప్పున వచ్చినట్లు పేర్కొన్నారు. ఆకులమైలారం, అన్నోజిగూడ, బైరాగిగూడ, కొత్తగూడ, కొత్తూర్, మాదాపూర్, పులిమామిడి గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు.

నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

సీఐ మహేందర్‌రెడ్డి



నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకుంటున్న సీఐ మహేందర్‌రెడ్డి

మీర్‌పేట: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.మహేందర్‌రెడ్డి వ్యాపారస్తులను హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్, నందనవనం, డీఎంఆర్ఎల్ కాలనీ, హస్తినాపురం, భూపేష్‌గుప్తానగర్, కర్మన్‌ఘాట్, బడంగ్‌పేట ప్రాంతాల్లో గాలిపటాలు, మాంజా విక్రయిస్తున్న దుకాణాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న చౌదరిపేట విజయ్ భాస్కర్, గుంటూరు ధర్మరాజు, ఎండి.అహ్మద్‌అలీఖాన్, ఎస్.సాయిలపై పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి మాంజాను స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా వాడటం వల్ల ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. కావున మాంజాను పూర్తిగా నిషేధించాలని ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. దాడుల్లో ఎస్ఐలు బి.సత్యనారాయణ, జి.ఉదయ్ భాస్కర్ తదితరులున్నారు.

నూతన నియామకం

ఆమ్ ఆద్మీ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా సయ్యద్ గఫార్



సయ్యద్ గఫార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కృష్ణయాదవ్

మీర్‌పేట: ఆమ్ ఆద్మీ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా సయ్యద్ గఫార్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆయనకు శనివారం ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బార్కా కృష్ణయాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ గఫార్ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్న జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఉద్దేశంతో ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపించిన నాటి నుంచి కార్యకర్తగా పనిచేస్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో పార్టీని క్రింది స్థాయి నుంచి బలోపేతం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అడ్వకేట్ సోమనాథ్‌భార్తీ, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఇందిరాశోభన్, డా.దిడ్డి సుధాకర్, భూక్యా శోభన్, డా.అన్సారి, బుర్ర రాముగౌడ్, బర్కా కృష్ణయాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాలి



హస్తినాపురంలో సంతకాలను సేకరిస్తున్న యాదగిరి

హస్తినాపురం: విద్య, ఉద్యోగావకాశాలతో పాటు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను పెంచి వాటిని పటిష్టంగా అమలు చేయాలని బీఎస్పీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ జక్కా యాదగిరి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్‌లు పెంచాలని కోరుతూ ఎల్‌బీనగర్ శాఖ ఆధ్వర్యంలో హస్తినాపురం డివిజన్ పద్మావతి కాలనీ, షిరిడీ సాయినగర్, సంతోషి మాతా కాలనీ, డీఆర్‌డీఏ కాలనీ తదితర ప్రాంతాలలో ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీల కులగణన చేపట్టాలని , కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి వాటిని ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. అయినా ఆదిశగా చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు సంపత్, కట్టకుమార్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో ముగ్గుల పోటీలు

హస్తినాపురం: సంక్రాంతి సందర్భంగా హస్తినాపురంలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో పతంగులు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ముగ్గులు అందంగా వేసి అలరించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

స్నేహితుడికి ఆపన్నహస్తం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేవారే నిజమైన స్నేహితులని నిరూపించుకున్నారు. రూ.86 వేలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా మారింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి 1995–96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు రూ.86 వేలు అందజేసి అండగా నిలిచారు. సతీష్‌కుమార్‌కు ఇంకా ఎవరైనా ఆర్థికసాయం చేయాలనుకుంటే 98662 08130 నంబరుకు గూగుల్‌పే, ఫోన్‌పే చేసి ఆదుకోవాలని అతని సతీమణి శ్రీలత కోరారు.

నిరుపేదలకు చేయూతనందిస్తాం

తలకొండపల్లి: నిరుపేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించి వారికి అండగా ఉండి ఆదుకుంటామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపనమోని ఈదయ్యకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిలిండర్ గ్యాస్ పొయ్యి అందజేస్తానని చైర్మన్ భరోసా పలికారు. ఈ మేరకు శనివారం రాఘవేందర్‌రెడ్డి గ్యాస్ పొయ్యిని ఈదయ్యకు తలకొండపల్లిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, యాదగిరి బోళ్ల, శ్రీనివాస్, మహేశ్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని సుందరయ్య నగర్ కాలనీలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మహిళా సంఘం, ప్రజానాట్యమండలి కేవీపీఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శనివారం వనస్థలిపురం సీఐ సత్యనారాయణ ప్రారంభించారు. యువతకు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.యాదయ్య, మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేశ్, నాయకులు భాస్కర్, పున్న శ్రీనివాస్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి పెంచుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి (బంటి) అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కర్ణంగూడ గ్రామంలో ఉప్పరిగూడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నల్లబోలు అంజిరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ నల్లబోలు మమత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ, తదితరులు